# పెన్నేటి కతలు

— రామకృష్ణారెడ్డి

## కరుబుజ్జ తోట

తూరుపువక్క కంచెకు ఒక సాటు[1] కంతవడి బరెగొడ్లు దూరి తోట్లోకి వస్తావుండాయని, వాటిని కనిపెట్టుకోని వుండడం సావుజంపులుగా వుందని, అమ్మ చెప్పడం గ్యావకమొచ్చి కొండిగాడు ఆ వక్కకు పోయినాడు. అప్పటికే రోజా వస్తావుండాదని చెప్పిన దొంగముండా కొరు కొమ్ముల ఎనుము, కొమ్ముల్తో కంతనింగా పెద్దది చేసుకొంటా, దూరబోతాంది. "థేయ్! థేయ్! నీయమ్మ..." అని కొండిగాడు అదిలిచ్చినాడు. "తోట్లోకి పోదామంటే కుదరక పాయెనే" అనుకుంటా కొరుకొమ్ముల ఎనుము పాయె.

ఆ కంతవడిని కాడ కొండిగాడు కంపమండలు నరిగా కప్పినాడు. గుడిసెకాడికిబోయి అడుండే రాగోడి[2] తీసుకోని, తోట బైటికి పోయి ఇంగా రెండు మూడు మండలు యేసుకొని తెచ్చి, ఆడేసి తొక్కియిన కేసినాడు. వానికి ఈ పొద్దు మెడ యిరుకుబెట్టే బాగా నొప్పిగా వుండడంతో వాళ్ళ నాయిన్తోపాటు కరుబుజ్జకాయ లెత్తుకోని పొద్దుటూరు మారికెట్టుకు వాళ్ళమ్మ పోయింది. కంత బూడ్చినాక కాయలేమన్నా తెగినా యేమోనని కొండిగాడు తోటంతా తిరిగినాడు. తోట ఒక్కసారిగా మాగడం మొదలు పెట్టడంతో అన్ని పామెర్లలోనూ[4] కాయలు తెగినాయి. తెగిన కాయల్లో యింగన్, బత్తాన, నప్పాయి, నప్పబిళ్ళ కాక కూజా కాయలు గూడా వుండాయి. గంప తెచ్చి, అన్నిట్నీ గుడిసెలోకి మోసినాడు.

"ఈ పొద్దు మాపటేలకల్లా నాలుగైదు గంపల కాయలు తెగేట్టుండాయి, రేపు యిద్దరు కూలోళ్ళను గూడా పిల్సుకోవాల్నేమో, నాయినొచ్చినాక అడగాల" అనుకుంటా, గుడిసె వక్క సెలెంలోకి దిగి మొకం కడిగినాడు. మొకం కడగడమంటే మన్ను యినుక యేలిమీదేసి యిట్టా అట్ట వండ్లకు రుద్ది, నీళ్ళు పుక్కిలించి ఊసినాడు. "సెలెం నీళ్ల సాదుం[5] వాసన వస్తావుండాయి" అనుకొన్నాడు. గుడిసెలోకి బోయి బుట్టిలో వున్న సద్ది దిక్కు సూసినాడు. అందులో కొంత కొరబువ్వా, సింతపండు కారెమూ వుంది.

"ఒక యింగన్ కాయను కోసుకోని తింటే ఎట్టుంటాది!" అని తమాసకు అనుకొన్నాడు. అది సిన్నదైనా రూపాయిగ్గ రూపాయిన్నరా సేస్తాది. మంచి తీపి రకం. అదే కూజా కాయగానైతే ఎంత పెద్దదైనా అగ్గువే. అది రుచీ పచీ వుండదు, నప్పగా వుంటాది. తింటే కడుపునిండుతాదంతే. తెల్లవార్జామున ప్యాటకు కాయ లెత్తకపోయిన అమ్మానాయినా రెండ్రూపాయిలు కర్చుబెట్టి దోసె, ఇడ్లీ తినకుండా నరగడుపుతోనే వస్తారు. అమ్మానాయినేగాదు, నెత్తిమీదిగంపల్తో మారికెట్టుకు పోయేవాళ్ళంతా ఇంతే. ఎప్పుడన్నా తింటే బువ్వల్యాకుండా కూజా కాయతిని వుంటారుగాని, రకం కాయను తిన్లేరు. మేలకం కాయను సూసినప్పుడు దీనికెంత లెక్క వస్తాదో అని తప్ప, దీన్ని తిందామని అనుకోలేరు.

"మనది యింగన్, బత్తాసాల బతుకు కాదురా నాయినా, కూజా కాయబతుకురా" అని నాయిన అన్న మాట గ్యావకం వచ్చింది కొండిగాడికి. ఈ మాట వాళ్ళ నాయిన ఏదో ఒక్క సారి అనలా, ఎన్నో మాట్లు అంటానే వుంటాడు. ఈ మాటలో వున్న నిజం కొండిగాడు యింతప్పట్నించి సూస్తా వచ్చిందే. ఈశ్వరయ్య కొడుకులు, వాళ్ళతోపాటు సదువుకొనే సావాసగాళ్ళతో కల్సి తోట కాడికొచ్చినప్పుడు సూస్తా వచ్చిందే. వాళ్ళొచ్చినప్పుడు, నాయిన మంచి మంచి కాయలు తెచ్చి కోసి పెడ్తే, వాళ్ళు ఒకటి రెండు ఒప్పులు[7] తిని, నగంతిని పారేసే వాళ్ళు.

పెల్లకు పొదుత్తినే, ఎరువూ, గావిగసెక్కా, సెనిక్కాయ సెక్కా యేసి, వాటితీగెలు తిప్పి, ముట్టూకంచె నాటుకోని, రాత్రింబవళ్ళూ తోటను కాపెట్టుకోని వుండేవాళ్ళు ఒక కాయను కోసుకోని తెగిచ్చి తిన్లేరు. తోట కోసం ఏ కష్టం సేయనోళ్ళు వచ్చి యిట్ట మెచ్చిన కాయలు తిని, పారేసి, నగుకుంటా మూతి తుడ్సుకొని పోతారు. ఈశ్వరయ్య వాళ్ళ రైతు. యాటా వాళ్ళు కరుబుజ్జ తోట ఏసుకొనేందుకు అప్పు యిస్తాడు, అప్పు వడ్డీతో గూడా తీర్చాల్సిందే. అయినా, ఆయన వాళ్ళ రైతు అయినందుకూ, అట్టా అప్పు యిస్తా వున్నందుకుగాను ఆయన ఇంటోళ్ళు తినేందుకు కొంత తోటను యేరేగా యేసి పెడ్తారు. మిగిల్న తోటతోపాటు దీనికీ వాళ్ళే సాకిరి సేస్తారు. ఆ ఇంటోళ్ళు తోటకాడికొస్తే వాళ్ళ బాగంలోని కాయల్నే తినాల్నని, పారేయాల్నని లేదు.

ఈ కరుబుజ్జ తోటలు యేసుకొనేవాళ్ళు పూర్తిగా ఎనసాయం నములు తెల్సినోళ్ళూ, సేసేవాళ్ళూ కాదు.



యాదాదిలో నములుండేది రెండు మూన్నెళ్ళయితే, ఎండాకాలం ని నములూ వుండవు. అప్పుడయితే ఈళ్ళకు బాకీలు గూడా పుట్టవు. ఈ తోటలు యేసుకోని, ఏదో ఇరవయ్యో మిగిత్తిప్పుకొంటే..... ఎండాకాలంలో కొంత ఆదరువుగా వుంటాదనుకొంటారు. అందుకే ఈ తోటలు నములయిపోయే శివరాత్రి నుంచి మొదలై, ఉగాది పోయేప్పటికి ఉడిగేట్టుగా యేసుకొంటారు. కొండిగాని నాయిన బక్కోడు యాటా ఏస్తా వుంటాడు కరుబుజ్జ తోట. కొండిగాడు సేతి కందేదాకా ఆలూ మొగుడూ యిద్దరే సాదులు దీసే కాన్నుంచి అంత పని సేసుకొంటా వచ్చినారు.

* * *

బక్కోళ్ళ తోటలో యిప్పుడు రోజుకు అయిదారు గంపల కాయలు తెగుతాండాయి. కాయలు గూడా మంచి రకం కాయిలయినందువల్ల రేటు బాగానే పలుకుతాండాది. రోజా మారికెట్టులో కాయలమ్ముకోని వస్తానే, సద్ది బువ్వన్నా తినకుండా ముగ్గురూ కూకోని ఆ పొద్దు ఎంత లెక్క వచ్చిందో, అట్టా వస్తే ఎన్నాళ్ళలో అప్పు తీర్తాదో లెక్కలేస్తా వుండారు. మాపటేలం కాయలు తెంపి, గంపలకు సేర్చి పెట్టుకోని, తెల్లవార్జామున్నే లేసి పునికెసగి లేదీ, మెడలు యిరిగేదీ సూడకుండా పోడం, రాడం సేస్తా వుండారు. పోను అయిదు మైళ్ళు, రాను అయిదు మైళ్ళు అదలా బాదలా పోడం, కాలిక్యాలికి కొట్టుకుంటా రాడం.

ఆ రోజు నగిర పొద్దున పై తోటలవాళ్ళు క్యారు బ్యారుమని అర్సుతా వుంటే, లేసి సూస్తే యింగేముంది? సెట్లన్నీ నీళ్ళలో మునిగి బాట్లు కనపడ్తా వుండాయి. గుడిసె గడ్డమీదుండడంవల్ల నీళ్ళొచ్చినట్టే తెలలేదు. మొబ్బు లేదు, మోడం లేదు. ఉరుము లేదు, మెరుపు లేదు. వున్నట్టుండి రాత్రిపూట దొంగోనిమాదిరి వచ్చింది ఏరు. తెల్లవార్నాక సూస్తే తోటంతా మునిగిపోయింది. ముగ్గురూ అట్టనే కూకొని సూస్తా వుండారు. ఎన్ని కాయలు పాయె, ఎంత లెక్క పాయె? ఎంత అప్పు మిగిలె!

మెల్లిగా నీళ్ళు గుడిసె కాడిక్యాడా వస్తా వుండాయి. లేసి సూస్తే నిన్న తెంపిన కాయలు గంపల్లో అట్టనే వుండాయి. తెల్లవార్జామున్నే పోయేందుకు కాల్యాడక పాయె! ఇవతల తోటపోతా వుంటే ఈ రొన్ని కాయల్తో ఏమయితాది? అట్టయితే యియిగూడా సెడిపోతే, వచ్చే లెక్క పోయినట్టే గదా! అందులో మంచి కాయలు! ఆలెమయితే అయింది పోదాం పా, ఆకిరోజుకదా! ఇన్నాళ్ళ కట్టాన్ని తోట మింగితే, తోటను ఏరు మింగె!

ముగ్గురూ గంప లెత్తుకోని పొద్దుటూరు మారికెట్టు దావ బట్టిరి. తోటంతా మునిగిపోయి, గంపల్లో కాయలు మిగిత్తే "ఈ కాయల్ను ఎన్నడూ తిన్నోళ్ళం గాదు యిప్పుడన్నా తిందాం" అనుకోలేకపాయిరి! ●

1. తోట 2. వంగం కొయ్య 3. కర్బూజా కాయ 4. లైన్లలో 5. కొంచెం చెడు వాసన 6. చిన్నగంప 7. ముక్కలు